కథానిక :

పెండ్లివూట

శ్రీ వేటూరి ఆనందమూర్తి

మే ఇరవై తొమ్మిదో తేదీ తిరుపతిలో మా చెల్లెలు పెళ్లి. ఇంకా పది హేను రోజు లుండగా నేనూ మా అన్నయ్యా యింటికి వచ్చేము. ఇల్లంతా బాగా హంగామాగా ఉంది. సున్నం వేయిస్తున్నారు. నేలమీద, గోడలమీద, ఎక్కడెక్కడ బీటలువారినయ్యో అక్కడల్లా సిమెంటూ అదీ వేయడం-అంతానూ - ఇల్లంతా రిపేర్లే! ఇల్లంతా సున్నపుమరకలే! గోడసున్నం ఆరిందో లేదో అప్పుడే దానినిండా గీతలు. మా పెద్ద క్కయ్యపిల్లలూ వాళ్లూ అప్పటికి వారంపది రోజులక్రితమే వచ్చారుట. ఇంట్లో మా పెద్ద న్నయ్యపిల్లలున్నారు. వారూ వీరూ కలిసి నానాబీభత్సమూ చేస్తున్నారు. పనివారు గోడకు వెల్ల వేసి వెళ్లడమే తరువాయి. ఈ కుఱ్ఱ వారంతా కలసి-రైలుబండి ఆటలు-గోడంబడే గీతలు గీసుకోంటూ, కూతలు కూసుకోంటూ ఇల్లంతా ఒకటే తిరగడం. ఆ సున్నమంతా కాళ్లకు మొగాలకు పులుముకోవడం-నలుగు రికీ పామి రావడమూ-నానాఅల్లరి చేస్తు న్నారు. ఇల్లంతా గందరగోళంగానూ-చిదర గానూ ఉంది. దండెంనిండా బట్టలే-వరసా వావీ లేకుండా గదులనిండా అడ్డదిడ్డాలుగా అన్నీ పెట్టెలే పోనీ అవతలిగదిలోకి వెడ దామా అంటే మెంతుల చేటలూ, మినప్పప్పు చేటలూను. ఇటు కదిలితే ఆవకాయజాడీలు, ఆమూల చూస్తే విస్తరాకుదిళ్లు, ఇంట్లో కాలు నిలిపేందుకు చోటు లేదు! రైలునుండి అప్పుడే దిగిరావడంవల్ల ఒళ్లంతా తలంతా దుమ్ము-ఆ రైలుబొగ్గూ అదీ అసహ్యంగా ఉంది. వెంటనే దొడ్లో కెళ్లాను స్నానానికి. అక్కడ ఒక్కబొట్టు నీరుంటే ఒట్టు. ఎండ మాడ్చేస్తోంది. 'స్నానానికి నీళ్లు లేవుట్రా?' అని కేకేశాను. "నూతిలో నీళ్లుతోడిపోసు కోం" డని సమాధానం వచ్చింది. 'ఏమీ కొళా యేమైంది?' అది ఉండీ ఒకటే లేకా ఒకటే-అత్యల్పమానమాత్రంగా వస్తాయిట. ప్రొద్దునో అరగంటా-సాయంత్రమో అర గంటా-అంతటితో బంద్. నారాయణా! నాపని కంగారైంది. ఇన్నాళ్లూ హాయిగా [illegible]-ఆ దివ్య[illegible] వేసవికాలం శెలవలు సగానికిపైగా గడిపేము విశాలానికివిశాలము-ఏకాంతానికేకాంతము అబ్బ' ఎంత బాగుండేది! ఇంటిప్రక్కనే ఏనాటికీ ఎండిపోని ఆ దివ్యకృష్ణాస్రవంతీ ప్రవాహము. అబ్బ! ఎంతసేపు పోసుకొన్నా నీరుమాత్రం సమృద్ధిగా ఉండేవి. అన్నీ వసతులే-అది కృష్ణాజిల్లా-ఇదో?...ఆ నూతిలో నీళ్లే యిన్ని తోడి పోసుకొన్నా.

"పెండ్లి పదిదినాలు లేదు-ఏంది స్వామి కొరతూడిరి సేసు తిరిగితిరి!" అన్నాడు తానే పనిచేస్తున్న మేస్త్రీ. ఏదో సమాధానం చెప్పి లోపలకి వచ్చేను.

"అబ్బాయిలు యీనాటికికూడా రానట్టయితే యిద్దరికి పేరా రెండు శుభలేఖలు పంపి ఉండేవాణ్ణి" అంటున్నారు నాన్నగారు నాకు వినబడేటట్టుగా.

ఇంకా ముందువచ్చినమాత్రం మేము చేసే దేముంది? కుఱ్ఱవాళ్లం. పైగా పెద్దవాళ్ల పను లకి అడ్డాలుతగులుతుంటాముకూడా. అయినా పనిచేసినా చెయ్యకపోయినా శుభకార్యవేళ ఇంటిపట్టున ఉండవలసిన నలుగురూ ఉం డడం వారి వాంఛ" మూడుపాళ్లు మేము చేసేది ఏమీ ఉండదు-బందాలపనులు తప్ప! సరే-మళ్లా ఆ వాతావరణంలో పడటానికి కొన్ని గంటలు పట్టింది నాకు.

ఆ పనీ యీ పనీ చేస్తూనే ఉన్నారు. అప్పుడే ఇరవైనాలుగు వచ్చేసింది మా పిన తండ్రిగారు వారు సకుటుంబంగా వచ్చేరు. ఇల్లంతా బలేసందడి. ఇంటికి పక్కయిల్లుకూడా మాయింటివారిదే! యింటివారు భార్యనీ

పిల్లల్ని పుట్టింటికి పంపడంచేత ఆయిల్లూ మాయిల్లే అయింది. అంతా గల్లంతే. మిత్రులు చాలామంది వచ్చేరు. ఇరవై నాలుగు దాటింది. ఇరవై అయినా దాటింది'

"ఊళ్ళో! అందరికీ శుభలేఖలు అందేనా యిట్రా? దీక్షితులుగారి కిచ్చేరా?" అని ఏందుకో జ్ఞాపకంవచ్చి అడిగారు.

"అన్నయ్య ఏదో ఆవేళ రాసినట్టు గుర్తు' అన్నాను. వెళ్లి అడిగితే-'పెద్దతమ్ముడికి రాసిచ్చినట్టున్నారా. అడుగువాణ్ణి' అన్నాడన్నయ్య. శుభలేఖల లిస్టులో చూస్తే మరి దీక్షితులుగారి పేరు లేదంగులో. రెండో అన్నయ్య నడిగితే 'ఆ శుభలేఖలసంగతే నే నెరుగను. ఆరోజు చింతపండు కెడితేనే...' అన్నా డతను, మా కీమలాట నాన్నగారు విన్నారు. కోపగించుకొన్నారు. ఇల్లంతా ఒక కొలిక్కి వచ్చింది.

'ఇప్పుడుమాత్రం మించుకుపోయిం దేమిటి? నేళి వెంటనే ఒక శుభలేఖ వారి కిచ్చిరండోయ్' అని సలహా ఇచ్చేరు మిత్రులు రాజుగారు. గబగబా ఒకటి రాసి పరుగున దీక్షితులుగారింటికి వెళ్లేను.

'అడడా—నాకు మొన్ననే వచ్చిందబ్బా.' అన్నారాయన! ఇంటికి వచ్చి ఆయనపేరూ లిస్టుతో ఎక్కించాము. 'ఏదో - పెండ్లిపూట హడావుడి!' అనుకొన్నా గందరూ ఆతరువాత.

గంటలు గడుస్తున్నకొద్దీ గడబిడి హెచ్చుతోంది. ఆవేళ ఇరవై ఎనిమిది రాత్రి పదింటికి పెళ్లికొడుకువారు వస్తున్నారు ఊరికి. కాబోయే బావగారు చిన్నప్పు డెంత బియ్యం తిన్నాడో ఏమోగాని ఆరాత్రి పెద్దపెట్టున గాలివాన వచ్చింది. మాకు భయమేసింది. ఈ వానే తెల్లార్లూ కురిస్తే! ఏమున్నా ఉందీ? ఆఖరుకి పొయ్యిలో కట్టెలుకూడా బాగా మండవు ఏమో. మరి-కాని వర్షంయొక్క ఉద్దేశ్యంవశాత్తు ఆరాత్రే ఆగిపోయింది.

ఉదయం తొమ్మిదింటికి మహూర్తం. సరిగ్గా సుముహూర్తంవేళ నేనక్కడ ఉండి తమాషా చూడాలని ఉబలాటంగా ఉంది. అప్పు డేడు గంట! మా మేనత్త పిలిచింది - "మా బాబుగా, ఇదుగో నీచెల్లికి జాకెట్టూ అదీని. కొత్త కుట్టించుకురా బాబూ, అయిదునిముషాలు. నిలుచున్న పాళంగా కుట్టిస్తాడు ఉత్తగుడ్డకన్నా కుట్టించిస్తే బాగుంటుంది. పోనాన్నా." అంటూ మొంగలిపట్టు పట్టింది.

"అదరితా వల్లకా దత్తయ్యా, ఫరవా లేదు ఉత్తగుడ్డ యిస్తే. ఇప్పు డిచ్చినా మాత్రం తొమ్మిదింటిలోగా వాడు నీకు పట్టిస్తా డేం? ముహూర్తంవేళకి నే నిక్కడుండాలి. నేను పోను. పోను. పోను పోను..." అన్నా గట్టిగా.

'అయ్యో, యీమాట తెలిస్తే నేను మా ఊళ్లోనే కుట్టించుకొచ్చేదాన్నిరా. మా బాబుగా పోయిరా. మళ్లా తొమ్మిదింటి కల్లా, అయినాసరే, అవకపోయినాసరే-తిరిగి వచ్చేద్దువుగానిగా.'అన్నది. తప్పదురా అనుకొని అదిపుచ్చుకొన్నాను. ఇంతలోనే యీ వార్త ఎలా ప్రాకిందో పెళ్లికొచ్చిన ఆడంగులంతా తయారైనారు తలోగుడ్డా చేతపుచ్చుకొని.

'ఇదుగో మాకునాయినా - ఈ అంచు చేతికీనీ, ఈ అంచునడుముకీ వేయమను - అంతా యిదే కొలత. చేతికి యిన్ని మడత లక్కర్లేదులే...' ఏవేవో పేపన్లు చెప్పటం మొదలెట్టింది ఒకావిడ.

'ఈ చీరెఅంచు కొత్త కుట్టమని చెబుతూ-'

'ఈ జాకెట్టు కొత్త త్వరగా యిమ్మని చెబుతూ-' అంటూ నలుగురూ నన్ను చుట్టుముట్టేరు. 'సరే, అందరివీ ఒకేసారి తెండి' అని పుచ్చుకొని ఓమూట కట్టుకొన్నాను ఆసమూహంలోంచి బయటపడ్డా. వాకిట్లో కొచ్చేసరికి రాజుగారు కేకేసారు.

"ఇదుగో బాబూ - మీ బావగారు స్నానాని కెళ్లారు. తుండుగుడ్డా బట్టా అవీ ఏదో చూడు బాబూ, త్వరగా వెళ్ళు' అన్నారు. ఈ మూట చంక నెట్టుకొని బట్టలగదికేసి వెడుతుండగా వంటమనిషి శాస్త్రులు ఎదురయ్యాడు.

'సార్ - వడలు చేసేదానికి ఉద్దిపప్పు కావాల. యిప్పుడు నానవేస్తేగా సాయంకాలానికి అవును. లేకుంటే నన్నిం చి కాదు. స్టోర్ రూమ్‌కి పోయేసి బిరీన అంపియ్యండి' అని చాలా సీరియస్‌గా చెప్పేడ. చిటికలో వద్దామని స్టోర్ రూమ్‌కి పరుగెత్తేను. అందులో ముని కూర్చున్నాడు - నన్ను చూడగానే అమాంతంగా బయటికురకపోతూ

'ప్రొద్దున్నంచీ టిఫెను లేదోయి అందరూ తిన్నారుట - నువ్వు కాస్సేపు యిక్కడ కూర్చుంటే నేను వెళ్లివస్తాను' అన్నాడు తోటకూరకాడల్లే మొహంవేసుకొని.

'టిఫెనా' అరగలే - నువ్వూ తిన లేదు. అయిదునిముషాలలో నేనూ తినొస్తా. ఆపైన నువ్వు వెడుదువుగాని' అని బయటికొస్తూ.

'మునీ - ఓయ్ మునీ - వారు స్నానాల గదిలో ఉన్నారుట. బట్టలూ అవీ పంపుతున్నారు. అదేదో ఈలోగా కాస్తచూడు' అని అతనికిపురమాయించి చంకనున్న మూట అక్కడ పెట్టి గబగబా ఫలహారాలు పెట్టే చోటుకి పరుగెత్తబోయాను - మార్గంలో వెంకటేశ్వరరావుగా రడ్డుపడి -

'ఇదుగో అబ్బాయ్. వెండిగిన్నె కావాలట గంధం అదీ యియ్యడానికి. వెళ్లి త్వరగా తెచ్చిపెట్టు' - అంటూ ఉరికించేడు నన్ను. పరుగున వెండిసామాను న్న గదిలోకి పోయాను. ఆ గదిలో ప్రత్యక్షమయ్యారు కోటయ్యగారు.

'అనందూ - తక్షణం వెళ్లి - శ్రీరాములు యింటిదగ్గర ఉంటాడు. వెళ్లి నేను పిలుస్తున్నానని వెంటనే పిలుచుకురా - త్వరగా రావాలి సుమా!' అని ముహూర్తానికి శ్రీరాములు లేకుంటే శిలైనా కదలదన్నట్టుగా అంత ఆతురతతో చెప్పేరు. చచ్చేనురా దేముడా-ఎక్కడి శ్రీరాములు యిల్లు - ఏమిటికథ! అయినా అప్పుడు - అలస్యమూ కాకూడదు. వెండిగిన్నెమాట సగం చెప్పీ చెప్పకుండానే బయటికొచ్చేశాను. ఆ ఎండలో పరుగెత్తుకుంటూ వాళ్లింటి కెళ్లి 'శ్రీరాములుగారున్నారా?' అని అడిగితే 'లేరు-ఉదయమే వారు బయటి కెక్కడికో వెళ్ళే'రన్నది వారి భార్య. ఈ మాట చెవునేసుకొని అదేపరుగున యింటికి వచ్చి ఆతురతతో ఎదురుచూస్తున్న కోటయ్యగారితో 'వారిల్లో లేరండీ' అని రెండుముక్కల్లో చెప్పేశాను.

'అయ్యో నా తెలివా - సుబ్బారావుగారింట్లో ఉన్నారేమో చూచి రాకపోయావూ' అన్నా రాయన నా సమాధానానికి ఎవగించుకొంటున్నట్టుగా. నిజంగా నేను సుబ్బారావుగారింటికి వెళ్లి చూచి రాలేదు, మళ్లా నన్నక్కడికి తరుముతారేమో నన్న దిగులుతో

'వారింట్లోనూ లేరండీ' అనేశాను బాధ్యత తీరిపోతుందని.

'అక్కడా లేకుంటే సత్రం దగ్గరే ఉండి ఉంటాడు. చూడూ-నేను రాత్రే చెప్పిఉంచానులే - అయినా మంచిది మరోమారు జ్ఞాపకంచేస్తే.

రేపుఉదయమే పెండ్లికొడుకుగారి మేనత్త బంధువొకరు. వారితోబాటు నలుగురు - కొండ కెడతారుట - మొత్తం ఐదు ఫస్టు క్లాసుబస్సుటిక్కెట్టు రాసిఉంచమని చెప్పి రావాలి. పో - త్వరగా రా భోజనాలవేళవుతోంది' అన్నారు వెంటనే ఏమీ తడుముకోకుండా.

నా ఒంట్లో తేళ్లూ జెర్రులూ ప్రాకినయి. అయినా చలామట్టుకు సర్దుకొని ఊరుకొన్నా.

'బస్సుటికెట్లకిప్పుడేం తొందరండీ - కాస్త చల్లబడ్డాక సాయంత్రం వెళ్లి చెపితే చాలదుటండీ.' అన్నాను నెత్తి గోక్కుంటూను - ఒప్పుకుంటారేమో నని - కాని ఊహుఁ.

'ఎలాగు బాబూ - ముందుగా బుక్ చేయొద్దూ? చూడు మరి యీమాత్రంపనైనా మీరు చేసిపెట్టద్దూ?' అన్నారు. ఆయనతో నేనేమీ మరి మాటాడలేదు. సరే నని సత్రానికి నడక సాగించాను. నాకు సైకిలు రాదుమరి, నడుస్తూనే ఏదో ఆలోచిస్తున్నాను - 'ఈమాత్రం పనైనా మీరు చేసిపెట్టద్దూ?' - ఎందుకు చెయ్యనూ? అసలు మీరు నాచేత సొంతంగా చేయించుకొన్న పనేమిటి? ప్రొద్దున్నించీ చూస్తూనే ఉన్నాగా - ఏపనితో దినం మొదలెట్టానో, ఇప్పుడేం పని చేస్తున్నానో. అవును. 'నాచేత ఏపని సొంతంగా చెయ్యనిచ్చారు మీరందరూ కలిసి? పైగా యీ మాట అంటారా - ఏదో ఆలోచించుకొంటూ నెమ్మదిగా నడక సాగిస్తున్నా. త్వరగా వస్తే మళ్లా ఏదైనా పని తగులుతుందేమో చూడాలని. ఆశపడ్డ ముహూర్తవేళ ఎలాగో దాటిపోయింది. గతి మందంగానే ఉన్నా సత్రంమాత్రం త్వరలోనే వచ్చింది. అక్కడ పరామర్శిస్తే శ్రీరాములుగా రక్కడ కూడా లేరని తెలిసింది. చుట్టుపక్కల తెలిసినవాళ్లందరినీ అడిగాను శ్రీరాములుగారి ఉనికిగురించి. ఎక్కడా లేరు. సరే. వెనక్కి తిరిగి బయలుదేరాను. కోటయ్యగారు నాకోస మెదురుచూస్తుంటా రనుకొని సందుమలుపుదగ్గఱనుంచీ రొజుకొంటూ యింటికొచ్చాను. వాకిట్లో ఎవరూ లేరు. ఎదురుచూస్తూ సావిట్లో ఉన్నా రందరూ మళ్లీ.

'కోటయ్యగారూ - శ్రీరాములుగారు సత్రంలోనూ లేరండీ-' అన్నాను.

'ఇదుగో - ప్రొద్దుటినుండీ వారీసా ట్లోనే కూర్చునిఉన్నారుట. ఆ సంగతి తెలీక పాపం నిన్ను తరిమే నీ యెండలో.' అని అనునయించబోయారు కోటయ్యగారు.

'నాకోసరమా పోయేసివస్తివి యీ ఎండలో' అని అడిగారు శ్రీరాములుగారు చెయ్యిలాగి క్రింద కూర్చోబెడుతూ.

'చంపేరు బాబూ మీ రిక్కడ—.' అన్నాను.

అక్కడకూర్చుంటే ఎలాగ? వెంకటేశ్వరరావుగారికి వెండిగిన్నె ఎవరిచ్చారో - నాకక్కడ టిఫి నుందో లేదో - ముని పాపం టిఫిన్ పుచ్చుకొన్నాడో లేదో - బావగారి బట్టలసంగతేమైందో - శ్యామన్నకి ఉద్దిపప్పు యిప్పించారో లేదో... తెలుసుకోవద్దూ?

'ఇప్పుడే వస్తానండీ' అని శ్రీరాములుగారితో చెప్పి లేచాను. వరండాలోకి వచ్చేసరికి కృష్ణయ్యగారు నా జబ్బట్టుకొని.

'మీరందరూకూడా యిలా తిరుగుతే ఎలాగానండూ? పంక్తితర్వాత పంక్తి కూలే లేవాలిగానీ...' అంటూ ఓ విస్తరిముందు కూలేసారు. పెండ్లిభోజనం. ఏం సాక్కుతుంది. కందిపచ్చడి గొడ్డుచారు రుచి వస్తుందా? తిని లేచి తాంబూలా లిచ్చి-ఓ కునుకు తీసి మళ్లా పెళ్లింటి కెళ్ళాను.

సావిట్లో ముని ఎదురుపడి 'ఏంపని చేశావయ్యా' మీ బావగారిప్పుడు అలిగికూర్చున్నారు.' అన్నాడు.

'ఏమి? నేనేం చేశాను బావగారి అలకకి'

'నువ్వేమో ఆ గుడ్డలమూట నాగదిలో పెట్టి-స్నానాలగదిలో వారెవరికో బట్టలు పంపమన్నావు - ఇవేకాబోలు ననుకొని వాటిని పంపించాను. అందులో ఏమున్నాయో కూడా నేను చూడలేదు. ఇప్పుడు తెలిసింది.' అన్నాడు గుటకమ్రింగుతూ.

'అరి నీతెలివి మండిపోను-బలే తంటా తెచ్చావే. ఆడవాళ్ల జాకెట్లు-చీరెలూ నోయ్ అవి! వాటిని పెళ్లికొడుకుగారికి పంపేవన్న మాట!!

'ఎంత పరిహాసమైనా స్నానం చెయ్యమని చెప్పి-చీరెలూ రవికెలూ పంపుతారా? అని ఆయనగారికి కోపం వచ్చింది. అదీకాకుండా ఒళ్లు రుద్దుకొనేందుకు సబ్బా అదీ అక్కడెక్కడా లేదుట. బయటికొచ్చేసి - ఒళ్లంతా కళ్లంతా ఎఱ్ఱచేసుకొని బుడబుడా ఆ యెండలో బజారుకెళ్లి సబ్బొకటి కొనితెచ్చుకొన్నారు."

'ఓరి నీతస్సా చెక్క - చాలా గ్రంథం నడిచింగే-'

'మరి నువ్వు స్పష్టంగా చెప్పేవు కావు'

'నా కుమాత్రం ఏం తెలుసూ అక్కడ సబ్బా అదీ లేదని - ఏదో - పెండ్లిపూట హడావుడి! మరి ఆ గుడ్డల సంగతేమైంది?

'ఏమైందీ? మీ మేనత్తగారూ వాళ్లూ వచ్చి నువ్వు పనిచేసిపెట్టావు కావని కోపగించుకొన్నారు - ఎవరిగుడ్డలు వాళ్లు తీసుకెళ్లిపోయారు?'

ఈ మాటలసందడిలో మినప్పప్పుమాట మఱచిపోయా నడగటానికి. సాయంత్రం అయిపోయింది. ఆరాత్రి డిన్నర్ - అందఱము కూర్చున్నాము - మా బావగారికి కూడా కొంతఅలక తీరిం దప్పటికి! డిన్నర్ జరుగుతుండగా మధ్య ఎవరో పెద్దమనిషి అక్కడివారిని హెచ్చరిస్తూ - 'ఏమిండీ, మెనూకార్డులో వడలూ - ఆవడలూ వెటంసు ఉన్నాయి. మరి అవేవీ విస్తట్లో పడలేదే!' అన్నారు-

నా నాలిక కొరుక్కున్నా. ముని పక్కన లేడు మినప్పప్పు సంగతేమైందో అడగటానికి. ఈలోగా ఎవరో శ్యామన్నని అడిగా రవేవని!

'తెల్లవారుతోనే అయ్యగారితో చెప్తిని సార్ - వారు ఉద్దిపప్పు అంపియ్యనేలేదు. ఏంపెట్టి చేసేది సార్? అన్నాడు వేలు పెట్టి అందఱిలోనూ నన్ను చూపుతూ. తప్పింది కాదు - కథ మేనత్తగారిచ్చిన రవికగుడ్డలదగ్గఱినుంచీ మెనూకార్డుదాకా సంగతి అంతా పూసగ్రుచ్చినట్లు విన్నవించుకొన్నాను.

'ఏదో-పెండ్లిపూట హడావుడి!' అన్నా రందరూ నవ్వు ఆపుకోలేక - మా బావగారి అలక సంపూర్ణంగా తీరిపోయింది!

కుష్ఠు ★ బొల్లి
వగైరా మేహ, సుఖవ్యాధులు, సెగ, సవాయివ్యాధులకు, గ్యారంటీ చికిత్స, క్యాటలాగు ఉచితం
జి. వి. రెడ్డి అండ్ కో., "భాస్కరాశ్రమము",
గోపాలపురం, తూర్పు గోదావరిజిల్లా